దివాకర్‌తో పరిచయం ఉన్న వాళ్ళు ఎవరైనా ఆకర్షణీయంగా మాట్లాడటం కూడా ఒక విద్యే అని ఒప్పుకుంటారు.

జీవితాలనీ, సంఘటనలనీ క్రికెట్ కామెంటరీలా వ్యాఖ్యానించే అతనితో మాట్లాడుతుంటే గంటలు నిమిషాల్లా గడిచిపోతాయి. అలా అని అవి కృత్రిమంగా, నాటకీయంగా ఉండవు. సహజంగా, ఎదుటి వ్యక్తిని ఆలోచింప చేసేవిగా ఉంటాయి.

అనుభవం అతనికి ఆ విద్య నేర్పితే, పాడటం అతనికి ఎవరూ నేర్పకుండా అబ్బిన విద్య.

దివాకర్‌లో నన్ను ఆకర్షించింది వాక్చాతుర్యం అనేకంటే ఆ గానమే అని చెబితే నిజం చెప్పినట్టు అవుతుంది



# తొలి తమకమింతే

దివాకర్ గొంతెత్తి పాడితే రేఖామాత్రంగా ఆ గొంతులో మోగే విషాదం పర్యవసానాన్ని మరిచిపోయేట్టు చేస్తుంది. ఏ వాటర్‌ఫాల్స్ దగ్గరో నిలబడినట్టు, ఏ గాలి హోరో వింటున్నట్టు అనిపిస్తుంది.

"నాకు ఈ ఊరు నుంచి ట్రాన్స్‌ఫర్ అయిపోతుంది. నువ్వొక్కసారి వచ్చి వెళ్ళు" అని అన్నయ్య వ్రాయకపోతే హైదరాబాదు వచ్చేదాన్ని కాదు. దివాకర్‌ని చూసేదాన్నీ కాదు.

నే వొచ్చిన మర్నాడు — అప్పుడే స్నానంచేసి వచ్చి తిలకం దిద్దుకుంటున్నాను.

కిటికీలోంచి ఎండ ధళ్ళున లోపలికి పడుతూంది.

"అబ్బాయిగారు ఉన్నారా?" అన్న గొంతు విని వెనక్కి తిరిగి చూశాను.

ఇంకా నేను ఉన్నారని చెప్పేలోపలే అన్నయ్య గదిలోంచి వచ్చి, "నువ్వా, దివాకర్? రా, రా" అని పిలిచాడు.

అతడు లోపలికొచ్చి కూర్చున్నాక పరిచయం చేశాడు.

"మా చెల్లెలు విద్య. ఏయుడీ మెడిసిన్ పాసై మా ఊర్లో ప్రాక్టీస్ చేస్తోంది. ఈ చెల్లాయ్, ఇతను దివాకర్—నా స్నేహితుడు. ఇక్కడే పనిచేస్తున్నాడు. ట్రెయిన్ రిజర్వేషన్ కావాలన్నా, అధికారులతో మాట్లాడాలన్నా వీడికి ఒక్క నిమిషంలో అయిపోతుంది. అందరూ వీడికి స్నేహితులే" అని అన్నయ్య అతని భుజం తడుతూ అన్నాడు.

నేను నమస్కారం చేశాను.

"మా అన్నగారు చెప్పినవన్నీ పొగడ్తలే కానీ, నే మాత్రం దివాకర్‌నే సుమండీ!" అన్నాడు ప్రతినమస్కారం చేస్తూ.

కాసేపు అవీ ఇవీ అన్నయ్యతో మాట్లాడాక నన్ను అడిగాడు:

"మీరు పల్లెటూరు ఎంచుకున్నారేం? సిటీలో ఎక్కడైనా ప్రాక్టీసు పెడితే మంచి అవకాశాలు ఉండేవికదా?"

"పల్లెటూరు ఎంచుకోవటం ఏదో ఆదర్శంకోసం మాత్రం కాదు లెండి. నాన్నగారు రిటైరయ్యాక అక్కడే స్థిరపడ్డారు కాబట్టి ఆ ఊరు, స్వంత ఇల్లు సదుపాయంగా ఉంటుందని పెట్టాను."

"మా విద్య నీలాగే చాలా ప్లెయిన్‌గా మాట్లాడుతుందిరా" అన్నాడు అన్నయ్య.

"మంచిదేగా? అలానే ఉండాలి. లేకపోతే మనుషుల్లో దేన్ని అయినా భరించగలం గానీ, ద్వంద్వాన్ని మాత్రం భరించలేంరా!" అన్నాడు దివాకర్.

ఆ వేళ ఏదో సెలవు రోజు కావటం వల్ల అన్నయ్య అతన్ని బలవంతపెట్టి భోజనానికి ఉంచేశాడు.



మన కూతురు కిచ్చిన కట్నం లోటుకు డబ్బూ, నగలూ పట్టుకొచ్చేశా!

భోజనాలయ్యాక ఏవో కబుర్లు చెబుతూ హఠాత్తుగా జ్ఞాపకం వచ్చినవాడిలా అన్నయ్య అన్నాడు:

"అన్నట్టు విద్యా, చెప్పటం మరిచిపోయాను... వీడు చాలా అద్భుతంగా పాడతాడే!"

"నిజంగానా... అయితే, ఒక్క పాట పాడండి" అన్నాను.

'మ్రోగింపవోయి మురళి మ్రోగింపవోయి కృష్ణా ...' కృష్ణశాస్త్రి పాట, ఒక ఎంకి పాటకూడా పాడి వినిపించాడు.

అదే మొదటిసారి వినటం. ఆశ్చర్యపోయాను.

ప్రపంచ మంతటికీ పరిచయం కావలసిన గానం అతనిలోనే ఉండిపోవటం బాధ అనిపించింది. ఆ మాటే అంటే దివాకర్ నవ్వాడు.

"కళ కాస్మొటిక్స్ లాంటిదా గుర్తింపబడటానికి! కళాకారుడే దాన్ని గుర్తింపబడేలా చేసుకోవాలి. అలా చేసుకోవాలంటే డబ్బూ, పలుకుబడీ, చాలా హంగులే ఉండాలి. పోనీండి, ఏ నిర్బంధమూ లేకుండా నాకు పాడుకోవాలనిపించినప్పుడు హాయిగా పాడుకుంటూ ఉంటాను. చాలదూ?" అన్నాడు.

"మనుషులంతా నీలా తృప్తిపడటం నేర్చుకుంటే దేశం బాగుపడిపోతుందిరా" అన్నా డన్నయ్య.

"తృప్తి ఎప్పుడూ రాజీ ధోరణే. అది మనిషిని క్రింద పడెయ్యకుండా చూస్తుందేకానీ, దాని వల్ల ఏదో బాగు జరిగిపోతుం దనుకోవటం అనవసరం." అన్నయ్య మాటలను ఖండిస్తూ దివాకర్ అన్నాడు.

నేను వింటూ ఉండిపోయాను.

అతను వెళ్ళాక వదిన చెబుతుంటే అర్థమైంది—దివాకర్‌ది చాలా కష్టజీవితమని. దివాకర్ తండ్రి మొదటినుంచీ స్థిరంగా ఏ ఉద్యోగమూ చెయ్యకపోవటం వల్ల అతనూ, మిగతా పిల్లలూ సర్దుకుపోవటం అన్న దానికి అలవాటుపడిపోయి బ్రతికారు. అతని తండ్రి చేసిన పెద్ద పొరపాటేమిటంటే, దివాకర్ మెట్రిక్ చదువుతున్న రోజుల్లోనే ఉన్నదంతా అమ్మి వ్యాపారంలో పెట్టాడు. అత ననుకున్నట్టు రెండు చేతులా లాభాలు ఆర్జించలేదు కానీ, అప్పులుమాత్రం ఆర్జించాడు. దినం గడవని పరిస్థితి ఏర్పడేసరికి చేసిన తప్పు అర్థమైనా అప్పులు తీర్చలేక, ఆరుగురు పిల్లల్ని ఎలా పోషించాలో తెలియక ఇంట్లోంచి పారిపోయాడు. చూస్తూ వదలలేక, అతని అన్నదమ్ములు పిల్లల్ని చేరదీసి తిడుతూ, కొడుతూ దివాకర్‌కి ఒక డిగ్రీ వచ్చేదాకా చూశారు. ఏడాది క్రిందట అతని కి ఉద్యోగం అయిన దగ్గరినుంచీ తల్లి, మిగతా అయిదుగురి బాధ్యతా అతనిదే అయింది. ఇప్పుడు తన కొచ్చే మూడు వందల్లోనే అంతా బ్రతకాలి. తండ్రి అప్పులూ తీర్చాలి...ఇదీ అతని సమస్య.

"విద్యా! ఏం చేస్తున్నావు? మ్యూజియమ్‌కి వెడదా మన్నావుగా? దివాకర్ కూడా వచ్చాడు. చప్పున రా!"

అన్నయ్య కేక విని ఆలోచనల్లోంచి తేరుకున్నాను.

"తయారుగానే ఉన్నాను. పద" అన్నాను చెప్పులేసుకుంటూ.

"[illegible] అయిన వాడికి కూడా ఒక్కసారి ఆలోచించటానికంటూ ఏదీ ఉండదేమో కానీ, తెల్లవారితే డబ్బు ఎలా వస్తుంది అన్న ఆలోచన నాలాటి వాడికి మాత్రం నిత్యం ఉంటుంది" అన్నాడు దివాకర్, ఏమిటి ఆలోచిస్తున్నారు అని నే నడిగితే.

మ్యూజియమ్‌లో నాతో, అన్నయ్యతో బాటు నడుస్తున్నా, అత నెక్కడో ఆలోచిస్తుండటం నేను గమనించాను.

నేను నొచ్చుకుంటానేమో మళ్ళీ అతనే — "క్షమించండి ... కంపెనీ ఇస్తానని వచ్చి నా మటుకు నేను ఆలోచిస్తూ ఉండిపోవటం నేరమే! పోనీ, అన్నీ మళ్ళీ మొదటి నుంచీ చూద్దామా ... ఏం, రావ్?" అన్నాడు అన్నయ్య నుద్దేశించి.

అప్పటికి సగం చూడ్డం అయిందేమో వెంటనే అన్నాను: "ఇప్పటికే నా కాళ్ళు నొప్పి పెడుతున్నాయి. కానీ, కావాలంటే మీరూ, అన్నయ్యా చూసుకోండి. నేను ఇంటికి వెళ్ళిపోతాను."

దివాకర్ నవ్వేశాడు.

ఆ తరవాత మా మాటల్లో సరదాగానే పాల్గొన్నాడు.

అంతా చూడ్డం అయ్యాక మ్యూజియమ్‌లోంచి బయటికొస్తూ అన్నయ్య అన్నాడు: "ఇన్నాళ్ళుగా ఉన్నా, మ్యూజియమ్ చూడనేలేదు. నిజంగా ఇన్ని వస్తువులు నేర్పుగా పేర్చికూర్చిన వాళ్ళని అభినందించాలి. మనం పనికొచ్చే ఒక మంచి పని చెయ్యలేం."

"చెయ్యలేం కాదు. చెయ్యలేక పోతున్నాం అను. లేచిన దగ్గర నుంచి రన్నింగ్ రేసులో పాల్గొన్నట్టు సంపాదన కోసం పరుగులెత్తేసరికే కాలం అయిపోతుంటే దేనికీ వ్యవధీ, ఓపికా ఉండటం లేదు మనకి." దివాకర్ అన్నాడు.

"బాగుంది. మనిషి తాపత్రయం అంతా ఈ వేళ కాకపోతే రేపైనా సుఖంగా బ్రతకాలని కదా? జీవితానికి ఆమాత్రం వేగం ఉండాల్సిందే" అన్నా డన్నయ్య.

"అనుకో. అయినా, ఆ వేగం వల్ల పక్షుల్లా ఎత్తుకేమీ ఎగిరిపోవటంలేదు. పరిస్థితులు మనని వర్తమానంలోనే పల్టీలు కొట్టిస్తున్నాయి."

రోడ్డు క్రాస్ చేస్తూ దివాకర్ మాటలు వినలేదేమో, అన్నయ్య ఏం మాట్లాడలేదు.

పడమట సూర్యాస్తమయం అవుతున్న ఆకాశం కేసి చూస్తూ అన్నాను: 'ఈ పది రోజులూ ఇట్టే గడిచి పోయాయిరా, అన్నయ్యా! ఈ వేళ సరీ వరదాగా గడిచింది ... ఎప్పటికీ గుర్తుండిపోతుంది.''

అన్నయ్య [illegible] ఊకుకుంటే, దివాకర్ అన్నాడు:

''ఈ వేళ ఆఖరి రోజు కాబట్టి మీకలా అనిపిస్తోంది. ఏ అనుభవమైనా ఆఖరై పోతుంటే బాగుంటుందట. 'ది లాస్ట్ టేస్ట్ ఆఫ్ స్వీట్స్ ఈజ్ స్వీటెస్ట్ లాస్ట్' అన్నాడు కదా షేక్స్పియర్?''

''షేక్స్పియర్ సంగతి తరవాత మాట్లాడంకానీ, మనం మాట్లాడుతూంటే టాక్సీలన్నీ వెళ్ళిపోయేలా ఉన్నాయి.'' అన్నయ్య చెయ్యిఊపి టాక్సీని పిలుస్తూ అన్నాడు.

''మీ ప్రయాణం రేపే కదా? వీలైతే పొద్దున్న కలుస్తాను.'' దివాకర్ చెయ్యి ఊపి వెళ్ళిపోయాడు.

టాక్సీ తలు పొకసారి గట్టిగా వేసి వెనక్కి వాలాను.. టాక్సీ కదిలింది.

● ● ●

పొద్దుట పది కొట్టింది.

ప్రయాణానికి బట్టలు సర్దుకుంటున్నాను.

అన్నయ్య బజారు కెళ్ళాడు. వదినేదో పని చూసుకుంటూంది. ఫోను మ్రోగటంతో సూట్ కేసు మూత వేసి వెళ్ళి రిసీవర్ తీసుకున్నాను.

''హల్లో!''

''హల్లో! ఎవరు—విద్యగారేనా? గుడ్ మార్నింగ్.'' అతను దివాకర్.

''గుడ్ మార్నింగ్! ఏమిటిలా ఫోను చేశారు? అన్నయ్య కావాలా? ఇప్పుడే బజారు కెళ్ళాడు.''

''అబ్బే, అన్నయ్యకోసం కాదు. మీ ప్రయాణం ఈవేళేగా? నిన్న కలుస్తానని చెప్పాను గానీ, ఆఫీసులో ఇన్స్పెక్షన్ ఉంది. రాలేను.''

''ఓ! అదా? ఫర్వాలేదులెండి!'' అన్నాను.

''మీ అన్నగారికి కూడా త్వరలో ట్రాన్స్ఫర్ అయిపోతుం [illegible] బహుశా మళ్ళీ మీ రిక్కడికి [illegible] జ్ఞాపకం ఉంచుకోండి.''

ఆ గొంతులోని [illegible] తత్తరపడ్డా సర్దుకున్నాను.

''మిమ్మల్ని అయినా మరిచిపో నేమో కానీ, మీ పాట మాత్రం మరిచిపోను. అది ఖాయం.'' [illegible] నవ్విన శబ్దం.

''నా పాట మీ కంత నచ్చిందా? అదృష్టవంతుణ్ణి. సరే! సెలవా మరి! విష్ యూ ఎ వెరీ హేపీ జర్నీ!'' అన్నాడు.

నేను థాంక్స్ చెబుతూండగానే ఫోను పెట్టేసిన శబ్దం.

● ● ●

స్టెతస్కోపు పట్టుకుని మళ్ళీ నా పనిలో నేను పడ్డాను.

వచ్చిన కొత్తల్లో దివాకర్ తరుచూ జ్ఞాపకానికి వచ్చేవాడు.

తరవాత పనిలోపడి మరిచిపోయాను.

ఊరికి ఉన్నది ఒక్క ఆస్పత్రే కావటం వల్లా, అందులో సగం రోజులు డాక్టరు ఉండకపోవటం వల్లా, ఊళ్ళో బోర్డు కట్టిన మరో డాక్టరు లేకపోవడం వల్లా నా ప్రాక్టీసు బాగానే నడుస్తూంది.

ఆ రోజు —

అప్పుడే కాఫీ తాగి మెడికల్ పాంప్లెట్స్ ఏవో చూస్తున్నాను. నాన్న గారు నీళ్ళు పోసుకుంటున్నారేమో బాత్‌రూమ్‌లోంచి పైపు నీరు పడుతూన్న శబ్దం.

పదిహేనేళ్ళ కుర్రవాడు వచ్చి నా అక్క తెలివి తప్పి పడిపోయిందని, ఒక్కసారి రమ్మని గాభరాగా పిలిచాడు.

వెంటనే బాగ్ తీసుకుని బయలుదేరాను.

దేవాలయం పిఠి మలుపు తిరిగాక కుడివైపు సందులోకి తీసుకెళ్ళాడు.

వంకర తిరిగిన లైటు స్తంభమూ, దారిని తడిపేస్తున్న కాలువా.

సందు చాలా అసహ్యంగా ఉంది.

''ఇదే ఇల్లు!'' అన్నాడు, ఒక ఇంటి ముందు ఆగి.

గోడలు గోడల్లాగ, నేల నేలలాగా లేని శిథిలావస్థలో ఉన్న ఆ ఇంట్లో నీరసంగా పడుకున్న ఆ అమ్మాయిని చూడగానే ఎక్కడో చూసినట్టు అనిపించినా, ఎక్కడ చూశానో గుర్తు రాలేదు.

దగ్గరగా వెళ్ళి పరీక్ష చేశాను. నాడి బలహీనంగా కొట్టుకుంటూంది. నీరసం వల్ల పడిపోయిందని అర్థమైంది.

గ్లూకోజ్ ఇంజెక్షన్ చేశాను.

కాస్సేపు పోయి కళ్ళు విప్పాక మరేం ఫరవాలేదని చెప్పాల్సినది చెప్పి, ''రేపొకసారి రా. మందులు రాసి ఇస్తాను'' అన్నాను.

మర్నాడు ఆ పిల్ల చాలా అయిష్టంగా వచ్చినట్టే వచ్చింది.

లోపలికి పిలిచి కూర్చోబెట్టి గదికున్న కర్టెన్ లాగి ఫాను వేశాను.

''ఇప్పుడు చెప్పు. ఈ వేళ కాస్త కులాసాగా ఉందా?''

సమాధానం లేదు. నీరసంగా కళ్ళెత్తి ఒక సారి చూసి తల దించుకుంది.

''నువ్వు చాలా బలహీనంగా ఉన్నావు. రక్తం తక్కువగా ఉంది. మంచి టానిక్కులు, ఇంజక్షన్లు తీసుకోవాలి.''

చేతిలోకి కలమూ, లెటర్‌పాడూ తీసుకుని వ్రాయబోతుంటే హేళనగా అంది: ''వృథాగా వ్రాయకండి, డాక్టర్! నా కున్న జబ్బేమిటో నాకు తెలుసు. డబ్బు లేకపోవడమే పెద్ద జబ్బు. అది తీరితే మిగతా అన్నీ తీరినట్టే ... ఇప్పుడు ప్రిస్క్రిప్షన్ కాగితం మీ దగ్గరి నుంచి తీసుకుని కొంటానని చెప్పినా, ఇంటికెళ్ళి చింపేస్తానే కానీ కొనను. కొనలేను ... మందులు నా లాంటివాళ్ళకి లగ్జరీ, డాక్టర్!''

ముందు ఆ పెంకితనానికి ఒళ్ళు మండినా, ఆ అమ్మాయి కథనం విన్నాక నీరుకారిపోయాను. నివ్వెరపోయాను.

మనిషిని మనిషి ఇంత దారుణంగా దోచుకోంటారా? బాధపడ్డాను. అన్నగారు ఒక్కడూ కుటుంబాన్ని పోషిస్తూంటే చూడలేక తాను కూడా సాయపడాలని, కనీసం తన బ్రతుకైనా తను బ్రతకాలని ఇంట్లో ఇష్టపడకపోయినా ఈ ఊరొచ్చి కొత్తగా పెట్టిన ప్రైవేటు స్కూల్లో టీచరుగా చేరిందట. న్యాయంగా రావలసిన జీతం నూట ఏభై అయినా, ఆ స్కూలు హెడ్ ప్రతి వాళ్ళ జీతంలోంచి సగభై కొట్టి నూటపది ఇస్తాట్ట. ఆ రహస్యం పైకి రాదు.

''అక్కడ చేస్తున్న వాళ్ళంతా ఆ నూట పదైనా దొరకని నా లాంటి వాళ్ళే కదా?'' అంది. నిమిషం పోయాక అడిగింది:

''డాక్టర్! మీరు ... మీరు నా కో సాయం చేయగలరా?''

''నేనా! నేనేం సాయం చెయ్యగల నమ్మా—చెప్పు.''

ఆ కాస్త పరిచయంలోనూ ఆ పిల్లంటే నా కేదో అభిమానం కలిగింది.

''నిన్న చూశారు కదా? ఆ తమ్ముడికేదైనా పని చూసి పెట్టండి.''

చిన్న ఊరు. పైగా ఆ పిల్లాడు అట్టే చదువుకోలేదు. వయసూ లేదు. ఏం పని చూసి పెట్టగలడు?

ఆలోచిస్తుంటే గ్రహించినదానిలా ఆ అమ్మాయే అంది:

''ఏ పనైనా సరేనండి.. మీ దగ్గర ప్యూన్‌గా ఉంచుకున్నా సరే!''

ఒప్పుకోక తప్పలేదు నా కింక. నాకూ చేతి క్రింద ఎవ్వరూ లేరు. ఈ కుర్రాణ్ణి దగ్గర పెట్టుకుని ఒక టొకటి నేర్పించవచ్చు అనిపించింది. ఒకటో తారీఖు పంపమనీ, తాత్కాలికంగా ఏభై ఇస్తాననీ అన్నాను.

ఏభై ఆశించలేదేమో సంతోషంతో





ళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. అంగీకారంగా తల ఊపి వెళ్ళబోతుంటే అడిగాను:

"నీ పేరు?"

"వల్లి." వచ్చాక మొట్టమొదటిసారి నవ్వుతూ చెప్పిన జవాబు అది. చెప్పినట్టుగానే ఒకటో తారీఖున వాళ్ళ తమ్ముడు విఠల్ వచ్చాడు. నాన్నగారు కుశల ప్రశ్నలు వేస్తుంటే వింటున్నాను.

"మీ నాన్నగారు ఉన్నారా, బాబూ?"

"లేరండి."

"మరి నువ్వూ, మీ అక్కేనా?"

"అక్కకి ఇక్కడ ఉద్యోగం అయితే తోడుగా వచ్చాను. నా తరవాత వాళ్ళు మా అమ్మ, అన్నయ్య అంతా హైదరాబాదులో ఉన్నారు. మా అన్న దివాకర్. అక్కడ ఉద్యోగం చేస్తున్నాడు."

దివాకర్ పేరు వినగానే ఉలిక్కిపడ్డాను.

"ఏ దివాకర్, బాబూ?" ఆత్రంగా అడిగాను. వివరంగా చెప్పాడు.

అతను అన్నయ్య స్నేహితుడు దివాకర్! అద్భుతంగా పాడే ఆ దివాకరే. పోలిక లున్నాయి. కాబట్టే వల్లి నెక్కడో చూసినట్టు అనిపించింది. ఆ వేళ ఆ పిల్ల చెప్పింది విన్నానే కానీ, వివరాలు అడగలేదు.

అయ్యో! నేనేం చెయ్యబోయాను? దివాకర్ తమ్ముడి చేత నౌకరీ చేయించుకోబోయాను. స్నేహం అన్న పదాన్నే కలుషితం చెయ్యబోయాను. అసలు అతను మళ్ళీ నా ముఖం చూసేవాడా? నయం! ఇప్పటికైనా మించిపోయింది లేదు. వద్దని చెప్పెయ్యాలి.

నాన్నగారి కేదో నచ్చ చెప్పి విఠల్‌ని ఇంటికి పిలిచాను.

"మరో మంచి ఉద్యోగం చూసి పెడతాను, నా కిప్పట్లో ఎవరూ అవసరం లేదని చెప్పాను.

విఠల్ ప్రాధేయపడ్డాడు. నేను వినిపించుకోకపోతే నిస్సహాయంగా వెళ్ళిపోయాడు.

మరో నెల్లాళ్ళు గడిచాయి.

అనుకోకుండా ఆ రాత్రి నాన్నగారికి గుండెనొప్పి వచ్చింది.

నా వైద్యంతో రెండు రోజులకి సర్దుకున్నా, బెంగుళూరు అన్నయ్య దగ్గిరికి వెళ్ళిపోతానని గొడవ పెట్టడం మొదలు పెట్టారు. ఊళ్ళో మంచి ఆస్పత్రి లేకపోవటం వల్ల ఆయన్ని దిగబెట్టెయ్యటమే మంచిదనిపించింది.

నాన్నగారితోపాటు బెంగుళూరు వెళ్ళటం అయితే వెళ్ళాను కానీ, వెంటనే రాలేకపోయాను.




వెళ్ళిన నెల్లాళ్ళలోనూ నాన్నగారికి మరి రెండుసార్లు నొప్పి వచ్చింది.

రెండోసారి ఆయన ప్రాణాలు నా చేతుల్లో కానీ, మరే డాక్టరు చేతుల్లో కానీ లేవని తెలిసిపోయింది.

ఆయన పోయారు.

నా జీవితంలో అమూల్యమైన ప్రేమ పోయింది.

కొన్నాళ్ళు పోయాక పనిలేకుండా ఉంటే మరీ చిరాగ్గా ఉంటుందని బయలుదేరి వచ్చేశాను.

• • •

తలుపులు తీసి లోపలికి వెళుతూంటే నాన్నగారు లేని ఆ ఇంట్లో వస్తువులు, పుస్తకాలు అన్నీ ఎక్కడివక్కడ అలానే ఉన్నా ఏమీ లేనట్టు, ఏదో పెద్ద శూన్య మేర్పడినట్టు అనిపించింది.

నే నొచ్చానని అప్పుడే తెలిసిపోయిందేమో ఒకరొకరే వచ్చి పలకరించి పోయారు.

ఆ సాయంత్రం గేటు తీసుకుని లోపలి కొస్తున్న వ్యక్తిని చూసి మొదట ఎవరో పేషెంటనుకున్నాను. దీక్షగా చూస్తే అతను దివాకర్.

"జ్ఞాపకం ఉన్నానా! అన్నట్లు మీ నాన్నగారు పోయారట కదూ? విన్నాను. చాలా బాధనిపించింది." లోపలి కొచ్చి కూర్చుంటూ అన్నాడు.

గాయం కెలికినట్టయింది.

"పోయి రెండు నెల లవుతోంది అప్పుడే!"

క్షణం ఆగి అడిగాను: "అంతా బాగున్నారా? మీ వల్లి కులాసాగా ఉందా?"

"కులాసాగానే ఉంది కానీ, ఇక్కడ కాదు. పైలోకంలో ..." తాపీగా అన్నాడు.

క్షణం గుండె లయ తప్పి మళ్ళీ కొట్టుకున్నట్లు అయింది.

"ఏమి టది, దివాకర్? ఏమైంది?"

"ఏమవుతుంది? సరిగ్గా తినకుండా, మందులు పుచ్చుకోకుండా కష్టపడితే ఏమవుతుంది? అసలు జీతం అంతా రావటం లేదని, ఆ వస్తున్నది కూడా ఈ మధ్య సరిగ్గా అందటం లేదని నాకు ఇక్కడికి వచ్చేదాకా తెలియదు. తమ్ముడిచ్చిన టెలిగ్రామ్ చూసుకుని పరుగెత్తుకొచ్చాను. ప్రాణం పోతూ ఉన్నదాన్ని అప్పటికప్పుడు టాక్సీ చేయించి పక్క ఊరికి పట్టుకెళ్ళాను. కానీ, సమయం మించిపోయింది. 'సివియర్ ఎనీమియా' అన్నాడు డాక్టరు. దాని శరీరం మందుల్ని కూడా అరాయించుకోలేక పోయింది... జీవితంలో ఏం లేకపోయినా, నే నంటే ప్రాణం పెట్టే వల్లి ఉందనుకున్నాను. ఇప్పు డదీ పోయింది ..."

కన్నీళ్ళు దాచుకోవాలని తల దించుకున్నాను.

"విద్యా! మా విఠల్‌ని నువ్వు ఎందుకు అట్టే పెట్టుకోలేదు? దివాకర్ తమ్ముడైనందుకేగా?"

చివ్వున తల ఎత్తి కోపంగా అన్నాను:

"ఆ ప్రశ్న నువ్వు అడక్కూడదు, దివాకర్! నీ తమ్ముడి చేత నౌకరి ఎందుకు చేయించుకోలేదని అడుగుతున్నావా? నన్నంత నీచంగా ఊహించుకున్నావా? ఇంకా మంచి ఉద్యోగం చూపెట్టాలనుకున్నానే గానీ, ఇంత ఘోరం జరుగుతుం దనుకోలేదు. నను యానికి అర్హత కూడా లేను."

"క్షమించు, విద్యా ... వాడి కేదైనా పని దొరికి ఉంటే వల్లి మంచంమీదైనా మిగిలేదేమో అనిపిస్తోంది. డబ్బు జీవితాల కోసం ఆగుతుంది కానీ, జీవితాలు డబ్బుకోసం ఆగవు."

రెండు నిమిషాలు ఆగి మళ్ళీ తానే అన్నాడు:

"నాకు ... నాకు తెలుసు, విద్యా — మాలాంటి వాళ్ళ సమస్యలు వ్యక్తుల వల్ల పరిష్కరింప బడేవి కావు. వ్యక్తులనగానే వ్యక్తిగతమైన బలహీనతలు అడ్డొస్తాయి. ఆ స్వార్థం హెడ్ స్వార్థానికి లొంగిపోతే, ను వ్వాదుకోవా అనుకున్నా అభిమానానికి లొంగిపోయావు. మనిషికి ఉండే ముఖ్యమైన సమస్యలు ... తిండీ, ఆ తిండిని చూపించే చదువూ, ఉద్యోగం లాంటివి సమాజం పరిష్కరించనంతదాకా ఈ బ్రతుకు ఇంతే. ఇలా పడి లేస్తూ వెళ్ళాల్సిందే. నువ్వూ, నేనూ ఏం చెయ్యలేం."

అతని బేలెన్స్ ఆఫ్ మైండ్‌కి ఆశ్చర్యపోయాను.

అంత విషాదంలోనూ ఎవరినీ దుయ్యబట్టడం లేదు. లోపం ఎక్కడుందో చెబుతున్నాడు. అంతే.

"నేను విఠల్‌ని తీసుకుని రేపు వెళ్ళిపోతున్నాను, విద్యా! అనుకోకుండా నిన్ను కలవటమైంది. చెప్పి పోదామనే ఇలా వచ్చాను." వెళ్ళటానికి ఉద్యుక్తుడవుతూ అన్నాడు.

జరిగినదానికి బాధపడ్డానని చెప్పాలనిపించింది కానీ, ఆ మాట చెప్పటానికి ధైర్యం చాలలేదు.

"ఒక్క మాట చెప్పు, దివాకర్ ... నా మీద ... నా మీద నీకేం కోపం లేదుగా?" అన్నాను. గొంతు బొంగురు పోయింది.

వెళ్ళబోతున్న వాడల్లా రెండడుగులు వెనక్కి వేసి దగ్గరగా వచ్చాడు. నా వంక ఆరాధనగా చూస్తూ అన్నాడు:

"నీ మీద కోపమా, విద్యా ... ఎప్పుడూ, ఇంకెప్పుడూ అలా అనుకోకు. నా జీవితంలో మధురమైన జ్ఞాపకం అంటూ ఏదైనా ఉంటే అది నువ్వే." అంతే. గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు.

మనసు నిండా కలవరం. వెనక్కి పిలవాలనీ, ఏదో చెప్పాలనీ అనిపించింది.

అప్పటికే అతను గేటు దాటాడు.

సంవత్సరం క్రిందట తెల్లవారి ఎండలా నవ్వుతూ పరిచయమైన దివాకర్ ఈ వేళ నెమ్మదిగా, నీరెండలా నా ఇంట్లోంచి వెళ్ళిపోతుంటే కన్నీళ్ళు ఆగ లేదు నాకు. ★